తిరుపతిరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే బండ్ల

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 27 : ఉండవెల్లి మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన జోగుళాంబ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం కలుగొట్లలో నిర్వహించిన దశదిన కర్మకు వారు హాజరై తిరుపతిరెడ్డి కూతురు ఐజీ సుమతి, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, చల్లా గిరిధర్‌రెడ్డి, చల్లా అగస్త్యరెడ్డి, హరినాథ్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, గట్టు మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనను నిలదీస్తే అరెస్టులా?

అమరచింతలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అమరచింత, నవంబర్ 27: కాంగ్రెస్ అసమర్థ పాలనను నిలదీస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అక్రమ అరెస్ట్ చేయడం ప్రతిఒక్కరూ ఖండించాలని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు గౌడ్‌ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని మాగనూర్ గురుకుల పాఠశాలలో వారంలో మూడుసార్లు ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు దవాఖాన పాలైతే వారిని పరామర్శించి మద్దతుగా తెలిపేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెంను తెల్లవారుజామున అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు.

అనంతరం అమరచింత ఎస్సై సురేశ్ వారిని అరెస్టు చేసి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చిన్నబాల్‌రాజు, తోకలి రమేశ్, కటికె రాజేశ్, షాన్‌వాజ్‌ఖాన్, శ్రీనివాసులు, తెలుగు రమేశ్, డీసీ రాజశేఖర్, పురుషోత్తం, నారాయణ, చిన్న నర్సింహ, పెద్ద బాల్‌రాజు ఉన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

శ్రీదేవికి పూలమొక్క అందజేస్తున్న నాయకులు

అమరచింత, నవంబర్ 27 : గతంలో నియోజకవర్గంగా ఉన్న అమరచింతను అభివృద్ధి చేసేందుకు అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే అందులో అప్పుడు పురపాలక సంఘం ముఖ్య కార్యదర్శిగా ఉన్న టీకే శ్రీదేవి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నాగ భూషణంగౌడ్ పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘం ముఖ్య కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టీకే శ్రీదేవిని వారు హైదరాబాద్‌లో మార్యదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా పని చేసిన టీకే శ్రీదేవి అమరచింత నియోజకవర్గంగా ఉన్న అభివృద్ధి వెనుకబాటుకు గురికాగా ఇప్పుడు అమరచింత మండల కేంద్రం తోపాటు మున్సిపాలిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేసిందని వారు పేర్కొన్నారు.

పశువులకు సమతుల్యాహారం ఇవ్వాలి

సాతర్ల గ్రామంలో పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి

ఇటిక్యాల, నవంబర్ 27 : పశుపోషకులు తమ పశువులకు ఎండుగడ్డితో పాటుగా పచ్చగడ్డితో కూడిన సమతులాహారం ఇస్తే లాభాలతో కూడిన పశుసంపదను పొందవచ్చునని మండల పశువైద్యాధికారి భువనేశ్వరి సూచించారు. మండలంలోని సాతర్లలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పశుపోషకులకు వాటి పెంపకంపై పలు సూచనలు చేశారు. పశుపోషకులు కేవలం ఎండుగడ్డితో పెంపకం చేపడితే పాలదిగుబడి రాదని అలాగే పశువులు సరైన సమయంలో ఎదకురాక పోషకులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. దాణాతో కూడిన సమతుల ఆహారం ఇచ్చినప్పుడే పశువుల పెంపకం లాభదాయకంగా ఉంటుందన్నారు. 14ఆవులు, 20 గేదెలకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, గోపాలమిత్రలు ఉన్నారు.

ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి



కంపెనీపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 27 : ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో షేక్‌పల్లి, కొండేరు, జింకలపల్లి గ్రామస్తులు కలిసి బుధవారం హైదరాబాద్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఎస్ కంపెనీ వెదజల్లుతున్న విషపూరితమైన కాలుష్యాన్ని నివారించాలని, కంపెనీ నుంచి వస్తున్న దుర్గంధంవల్ల శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరన్న, వీరబాబు, శేషు, గోవిందుతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే ఆన్‌లైన్ నమోదు పరిశీలన

మల్దకల్, నవంబర్ 27 : మండలంలోని ఎలుకూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను డీపీవో శ్యాంసుందర్ బుధవారం పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఎంపీవో రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- కలెక్టర్ బీఎల్ సంతోష్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాలటౌన్, నవంబర్ 27 : ఉత్తమ పౌరులుగా ఎదిగి సమజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ బీఎల్ సంతోష్ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ 77వ వార్షిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా కలెక్టర్‌కు విద్యార్థులు గౌరవ వందనం సమర్పించి సాదర స్వాగతం పలికారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్లు ప్రారంభిస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా తయారు చేసేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అలాగే పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.లక్ష మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరయ్య, సీటీవో రాముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

- ఎస్పీ రావుల గిరిధర్

మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, నవంబర్ 27 : విద్యార్థినులు ఉపాధ్యాయులు సూచనలు పాటిస్తూ ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని, ఎలాంటి ఆకర్షణలకు గురి కావద్దని, ఎలాంటి వేధింపులకు గురైన మహిళలు, బాలికలు నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకొచ్చి వేధింపుల నుంచి బయటపడాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై అన్ని శాఖల అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఎదుగుతున్నారని, ఆడపిల్ల అనగానే చిన్న చూపు చూడకుండా తల్లిదండ్రులు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలన్నారు. తమ పిల్లలతో ఎప్పటికప్పుడు సమాజంలో జరుగుతున్న మంచి చెడుపై అవగాహన కల్పిస్తూ ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక భారాలను సైతం నేడు స్త్రీ శక్తి లాగుతోందని, ఉన్నత శిఖరాలను చేరుకొని పురుష శక్తికి తామేమి తీసిపోమని చాటిచెపుతున్నారన్నారు. విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వేధింపుల నుంచి బయటపడాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో యాదయ్య, మెడికల్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాంబాబు, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ చెన్నమ్మ థామస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరస్వతి, డీఆర్‌డీఏ ప్రభాకర్, సఖి సీఏ కవిత, భరోసా శిరీష, సౌజన్య, వనజ, విజయ్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

29న జిల్లా కేంద్రంలో దీక్షా దివస్

పెద్దమందడి, నవంబర్ 27 : ఈనెల 29న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించడం కోసం కేసీఆర్ చేసిన దీక్షను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జిగా యాదాద్రి భువనగిరి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. కావున మండల బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ/గట్టు, నవంబర్ 27 : అయిజ పట్టణంలోని గద్వాల రోడ్డు సమీపంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతోపాటు కింద వాలిన తీగలు సరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గురువారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ గోవిందు, ఏఈ నరేందర్‌లు తెలిపారు. అయిజ పట్టణంతోపాటు బింగిదొడ్డి, ఎక్లాస్పురం, దేవబండ, జడదొడ్డి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా గట్టు మండలం మాచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో పలు ఫీడర్లపై వాలిన చెట్ల కొమ్మలను గురువారం తొలగించనున్నట్లు అయిజ ఏడీఈ గోవిందు, ఏఈ చిన్నయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మాచర్ల, కొత్తపల్లి, మల్లంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు

వీపనగండ్ల, నవంబర్ 27 : పునరుత్పాదక ఇందన వనరులు(రెనెవబుల్ ఎనర్జీ రీసోర్స్) అనే అంశంపై మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాశ్ ఉపాధ్యాయ బృందం అభినందించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీలో ఇంగ్లిష్ మీడియంలో కల్వరాల ఉన్నత పాఠశాలకు చెందిన అభినవ్, తెలుగు మీడియంలో వీపనగండ్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థి చందన ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీ పరీక్షకు ఎంపికైయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజవర్ధనాచారి ఉపాధ్యాయులు మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ముందుండాలి

పాన్‌గల్, నవంబర్ 27 : విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు ముందుండాలని మండల విద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తొలిమెట్టు, లక్ష్య, నాస్, మధ్యాహ్నం భోజనం తదితర అంశాలపై హెచ్‌ఎంలకు వివరించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విజయ్, ఆనంద్, జమీల్, శివయ్య, కృష్ణ, విజయలక్ష్మి, తిరుపతిరెడ్డి, నాగయ్యగౌడ్ పాల్గొన్నారు.

పశు సంపదతోనే రైతులకు ఆర్థిక పరిపుష్టి

గట్టు, నవంబర్ 27 : పశు సంపదతోనే రైతులకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని పశుసంవర్ధకశాఖ అధికారి శంకరయ్య అన్నారు. మండలంలోని లింగాపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించి పశు పోషకులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వరలక్ష్మి, ప్రియాంక, వెటర్నరీ అసిస్టెంట్ కనకరాజు, పృథ్వీరావు, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సూర్యారెడ్డి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

- బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

వడ్డేపల్లి, నవంబర్ 27 : మాగనూరు పాఠశాలలో మళ్లీ ఫుడ్‌పాయిజన్ దురదృష్టకరమని, విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. బుధవారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 48 మంది విద్యార్థులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. విద్యార్థుల మరణాలన్నీ సర్కారు హత్యలేనని, ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతి చెంది 24గంటలు కాకముందే మంగళవారం నారాయణపేట జిల్లా మాగనూరు పాఠశాల విద్యార్థులు 30 మంది ఫుడ్ పాయిజన్‌తో దవఖానలో చేరడం సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలలు, గురుకులాలు, హాస్టల్స్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదంటే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీయూ కన్వీనర్ గడ్డం నర[illegible]బా, నియోజకవర్గ నాయకులు ఖాజావలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజిని

సమావేశంలో మాట్లాడుతున్న రజిని

వనపర్తి టౌన్, నవంబర్ 27 : సమాజంలో బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహాలకు పాల్పడిన వారికి చట్టపరమైన శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ బాలికల వసతి గృహంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, మహిళలకు, వరద బాధితులకు రూ.3లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందేందుకు నాల్సా టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టి న్యాయ సహాయం పొందవచ్చున్నారు. 18 సంవత్సరాలు నిండిన అమ్మాయికి 21 సంవత్సరాలు నిండిన అబ్బాయికి వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణయ్య, పద్మజ, బాలనాగయ్య, ఉత్తరయ్య, శ్రీదేవి, రఘు, సఖి కేంద్రం నిర్వాహకురాలు కవిత, హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల మాటలను గౌరవించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కవిత

గద్వాలటౌన్, నవంబర్ 27 : సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల మాటలను గౌరవించాలని జిల్లా న్యాయ సేవ సంస్థ సెక్రటరీ గంటా కవిత సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రూరల్ డెవలప్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ పెట్టాలని సూచించారు. బాల్యవివాహాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యతిరేక శక్తుల చేతుల్లో రాజ్యాధికారం

సెమినార్‌లో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

వనపర్తి టౌన్, నవంబర్ 27 : రాజ్యాంగ వ్యతిరేక మతోన్మాదుల చేతుల్లో మన రాజ్యాంగం బందీ అవుతుందని, రాజ్యాంగ రక్షణకు నేటి యువతరం ముందుండాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగం సామాజిక న్యాయం అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం భగత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్కైలాబ్ బాబు మాట్లాడుతూ భారత దేశంలోని అనేక కులాలు, మతాలు, బాషల జాతులను ఒకే విలువలతో కూడినటువంటి గొప్ప రాజ్యాంగాన్ని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించాడని, భారత రాజ్యాంగాన్ని మొత్తం అవగాహన చేసుకోవాలంటే మొదట ఉన్న ప్రియాంబుల్ సరిపోతుందన్నారు. ఇంత గొప్ప రాజ్యాంగాన్ని ఈ మతోన్మాద శక్తులు రోజుకో పేజి చొప్పున తిసివేస్తూ, వీరి పరిపాలనలో దళిత, ఆదివాసి , మైనార్టీ ప్రజలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ఉందన్నారు. బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఉన్న ఉద్యోగాలను తొలగిస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు, నాయకులు శరత్, బీసన్న, రంజిత్, మధు, రాములు, వార్డెన్‌లు సత్యనారాయణ, గోపానాయక్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుకుందాం

వడ్డేపల్లి, నవంబర్ 27 : బాలల హక్కులను కాపాడుదామని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. బుధవారం శాంతినగర్‌లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధంపై ఎంబీ ఫౌండేషన్ ప్రతినిధి హన్మిరెడ్డి ఆధ్వర్యంలో యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహ, ఏపీఎం రమేశ్, యూత్ సభ్యులు తిరుమలేశ్, వెంకటేశ్, నరేంద్ర, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు

గట్టు, నవంబర్ 27 : బాల్య వివాహాలకు చేసుకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని బోయలగూడెం, చమన్ ఖాన్ దొడ్డి గ్రామాల్లో బాల్య వివాహాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ అధికారులు అప్రమత్తమై స్థానిక తాసీల్దార్ సరితారాణి ఆదేశాల మేరకు ఆర్‌ఐ కృష్ణ ఆధ్వర్యంలో ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మిదేవి, పలువురు సిబ్బంది, పోలీసులు సంబంధిత గ్రామాలను బుధవారం సందర్శించారు. బాలికల వయస్సులను నిర్ధారించి పెళ్లికి అర్హులుకారని తేల్చారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులను కౌన్సెలింగ్ ఇచ్చారు. 28వ తేదీ గురువారం చేపట్టాల్సిన నిశ్చితార్థం కార్యక్రమాలను రద్దు చేసుకోవాలని అధికారులు సూచించగా బాలికల తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. అదేవిధంగా సీడబ్ల్యూసీ ముందు బాలికలు గురువారం హాజరుకావాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, డీసీపీవో నర్సింహ, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ నవీన్, పోలీసు సిబ్బంది బుడ్డన్న, వేణు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

రికార్డులను పరిశీలిస్తున్న రామ సుబ్బారెడ్డి

వనపర్తి టౌన్, నవంబర్ 27 : మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని గిరిజన అభివృద్ధి అధికారి రామసుబ్బారెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు వండిపెట్టే కూరగాయల నాణ్యతను ఆయన పరిశీలించారు. మెస్ కమిటీ సభ్యులు భోజనం చేశాకే విద్యార్థులకు వడించాలని, వేడి వేడి భోజనం పెట్టాలని, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాన్‌గల్, నవంబర్ 27 : మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం కొనుగోలు కేంద్రాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్ సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయిస్తే సన్నరకానికి రూ.500 రూపాయల బోనస్‌తో కలిపి మొత్తం రూ.2800 ప్రకారంగా చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవి, మాజీ సర్పంచులు జయరాములు, సాగర్, ఆంజనేయులు, నాయకులు పుల్లారావు, రాంచందర్, నరేందర్‌గౌడ్, ఏవో రాజవర్ధన్, ఏఈవో శైలజ, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన టీబీసెల్ అధికారులు

పాన్‌గల్, నవంబర్ 27 : రాష్ట్ర క్షయవ్యాధి సెల్ అధికారులు, డబ్ల్యూహెచ్‌వో టీబీ యూనిట్ బృందం డాక్టర్లు మహేశ్, శ్రీఘన, బ్లెస్సీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారితో కలిసి బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఏఎన్‌ఎం, ఆశలతో సమావేశం ఏర్పాటు చేసి టీబీ ప్రోగ్రాంలకోసం ఏఐటూల్, యూజర్ ఫ్రెండ్లీ యాప్(కృత్రిమ మేధస్సు) అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన అధ్యయనం, టీబీ ప్రోగ్రాంకు సంబంధించిన వివరాలను ఏఎన్‌ఎం, ఆశలకు వివరించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాసులు, డాక్టర్లు పరిమళ, కృష్ణమూర్తి, క్లైవిన్‌మార్క్, సిబ్బంది సిద్దగౌడ్ పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ ఉద్యోగులు

వనపర్తి టౌన్, నవంబర్ 27 : జిల్లా కేంద్రంతోపాటు పెద్దమందడి, పాన్‌గల్, కొత్తకోట, వీపనగండ్ల, రేవల్లి, మదనాపురం, అమరచింత, ఖిల్లాఘణపురం, ఆత్మకూర్, గోపాల్‌పేట, శ్రీరంగాపురం, చిన్నంబావి, పెబ్బేరు మండలాల కేజీబీవీల ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్షా ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తు వస్తున్నామని, మినిమం టైమ్‌స్కేల్ ఇవ్వాలని ప్లకార్డులతో నిరసన చేపట్టామన్నారు. భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జిలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు కనీస వేతనాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌లు, సీఆర్టీలు ఉన్నారు.

సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి టౌన్, నవంబర్ 27 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం నుంచి జరుగనున్న రైతు సదస్సులను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన శాస్త్ర, సాంకేతిక పనిముట్లు, పరికరాలకు సంబంధించిన పరిజ్ఞానంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మల్దకల్, నవంబర్ 27 : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మండలంలోని అమరవాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేశ్ తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ జీహెచ్‌ఎస్ గ్రౌండ్‌లో ఈనెల 29న జరిగే పోటీల్లో తేజస్విని, త్రివేణి, కేశవర్ధన్, లోకేశ్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, వ్యాయమ ఉపాధ్యాయుడు ఆనంద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మరియమ్మ పాల్గొన్నారు.